విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-గన్నవరం: విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ వీరపనేనిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో న్యూ లైన్ ఎరెక్షన్ మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 01:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సిపిడిసిఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజినీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు వీరపనేనిగూడెం, తెంపల్లి, బల్లిపర్రు, మెట్లపల్లి కండ్రిక, కొత్తగూడెం, చిక్కవరం, చింతగుంట, బిబి గూడెం, గొల్లనపల్లి, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేస్తారన్నారు.

గ్యాస్‌వెల్డింగ్, బీరువా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటుకు సన్నాహాలు

విశాలాంధ్ర-విజయవాడ : ఏఐటీయూసీ అనుబంధ సంఘంగా విజయవాడ గ్యాస్ వెల్డింగ్, బీరువా వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు నిమిత్తం సన్నాహక సమావేశం జరిగింది. సమావేశం. విజయవాడలోని దాసరి నాగభూషణం భవన్ నగర ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం గ్యాస్ వెల్డింగ్, బీరువాలు తయారీదారులు హాజరైయ్యారు. కమిటీ ఏర్పాటు, నియమ నిబంధనలు, కార్యాచరణలపై ఏఐటీయూసీ నాయకులతో చర్చించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, సీపీఐ నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, ఏఐటీయూసీ హాకర్స్ యూనియన్ నగర కార్యదర్శి కొట్టు రమణ తదితరులు పాల్గొన్నారు.

యలమర్తి అనురాధకు గిడుగు పురస్కారం

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక షా గులాబ్ చంద్ ప్రథమశ్రేణి జిల్లా గ్రంథాలయం, గుడివాడలో ఈ నెల 25వ తేదీన 11 గంటలకు జరిగిన గిడుగు జయంతి వారోత్సవాల్లో భాగంగా భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన సభలో తెలుగు భాషా వికాస సమితి సమన్వయకర్త డిఆర్పి ప్రసాద్ ప్రముఖ రచయిత్రి, హైదరాబాద్ నివాసి, యలమర్తి అనూరాధకు 2023 గిడుగు పురస్కారాన్ని ప్రధానం చేశారు. సాహితీ అభిలాషకులు జిల్లా పశువు వైద్యశాఖ అధికారి డాక్టర్ ఎంఎస్ఏ దివాకర్‌చే ఈ కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ గిడుగు వేసిన పునాది దినదిన ప్రవర్తమానమై జనబాహులంలోకి చేరి వ్యవహారిక భాష విలువను మరింత పెంచిందని అన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత అనూరాధ మాట్లాడుతూ రచయిత్రిగా ఈ పురస్కారం, ఈ రచనలు గిడుగు ప్రసాదించిన బహుమతి అన్నారు. మోకా మాధవరావు, గాదె మోహన్‌బాబు, లాల్ బహదూర్ శాస్త్రీ, చింతలూరి సత్యన్నారాయణ, కె. సుమలత, కొత్త మురళీకృష్ణ, బొగ్గరపు తిరుపతయ్య, సత్యనారాయణ, గొల్లపల్లి కిరణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'జలజీవన్ మిషన్'తో కుళాయిలు : మంత్రి జోగి

విశాలాంధ్ర-పెడన : పలు సంక్షేమ పథకాలు అందిస్తున్న జగనన్నకు మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ లబ్ధిదారులకు సూచించారు. పెడన మండలం కొంగంచర్ల, కుమ్మరిగుంట, కవిపురం, గురువిందగుంట గ్రామాల్లో శనివారం మంత్రి గడపగడపకు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత మంత్రి అంగన్వాడి చిన్నారులతో ముచ్చటించారు. మీకు ఏమి పెడుతున్నారు అంటూ చిన్నారులను మంత్రి ప్రశ్నించగా గుడ్డుపాలు అన్నం అంటూ బదులిచ్చారు. ఇంటింటికి వెళ్లి వారు పొందిన లబ్ధి పథకాల వారిగా వివరిస్తూ గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జల జీవన్ మిషన్ పథకం కింద కొంగంచర్లగ్రామంలో ప్రతి ఇంటికి ట్యాప్ కనెక్షన్లు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెడన ఎంపీపీ రాజులపాటి వాణి, పెనుమల్లి సర్పంచ్ గరికపాటి రామానాయుడు, తహసిల్దార్ పి.మధుసూదనరావు, ఎంపీడీవో వి రెడ్డయ్య, ఏఈ ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ స్రవంతి, హౌసింగ్ ఏఈ మాధవి, ఆయా గ్రామాల సర్పంచులు నాయకులు వివిధ శాఖల మండల అధికారులు పాల్గొన్నారు.

మహిళల సమానత్వ దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ వి ఎస్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో శనివారం మహిళల సమానత్వ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఆ కళాశాల మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ టి. కరుణశ్రీ ఆధ్వర్యంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ కేర్ మంజుల అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పీహెచ్సీ (మొవ్వ) సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ పి నిహారిక మాట్లాడుతూ మహిళలు విద్య, ఉద్యోగ అవకాశాలలో రాణించాలంటే తప్పనిసరిగా విద్యను అభ్యసించాలని సూచించారు. విద్య నార్జించటం ద్వారా సమాజంలో సమానత్వం సాధించడానికి మార్గం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు అధ్యాపకులు ఎం నాగ పరమేశ్వరి, సిహెచ్ రత్నం మేరి, డి సమత, వై సునీత, ఎస్ కే రఫియా తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు యూనిఫారం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని185 అంగన్వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు, హెల్పర్లకు ప్రభుత్వం అందచేసిన ఒక జత యూనిఫారంలను శనివారం ప్రాజెక్టు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఐసిడిఎస్.సిడిపిఓ పి భానుమతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సర్పంచ్ తూము పూర్ణచంద్ర రావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు పాల్గొన్నారు. ఈ యూనిఫారాలను 185 మంది కార్యకర్తలకు, ప్రస్తుతం ఉన్న176 మంది హెల్పర్లకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు అబ్దుల్ సలీ మున్నీసా, ఏఎస్ కళ్యాణి, సిహెచ్ ఆదిలక్ష్మి, విశ్రాంతమ్మ, డి మేరీ, ఆయా కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ పోరాట పటిమను చాటిన దివిసీమ పోరుబాట : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమ రైతాంగ సమస్యలపై దివిసీమ రైతు పోరుబాటలో సామూహిక సత్యాగ్రహ కార్యక్రమంలో మండుటెండను సైతం లెక్క చేయకుండా పాల్గొన్న రైతులు, పార్టీ శ్రేణులకు బుద్ధప్రసాద్ కృతజ్ఞతలు తెలియచేశారు.. శనివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పోరుబాట తెలుగుదేశం పార్టీ పోరాట పటిమకు నిదర్శనంగా నిలిచిందని బుద్ధప్రసాద్ అన్నారు. రానున్న రోజుల్లో రైతు సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసి కృష్ణాడెల్టా రైతాంగాన్ని రక్షించుకోవాల్సి ఉందని, ఇప్పటికే రైతుకు మోటార్లు, ఆయిల్ ఇంజన్లు పెట్టి నీరు తీసుకోవాల్సిన పరిస్తితి ఉందని బుద్ధప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు..నీరు లేక పగుల్లిచ్చిన నేలలు కనిపిస్తున్నాయని, వాన కురిస్తేనే గానీ రైతాంగం గట్టెక్కే పరిస్థితి లేదని బుద్ధప్రసాద్ తెలిపారు. శుక్రవారం జరిగిన రైతు పోరుబాట విజయవంతమైన నేపథ్యంలో మనపై భాధ్యత మరింతగా పెరిగిందని, ఏ గ్రామంలో నీటి సమస్య తలెత్తినా స్థానికంగా ఉన్న తెలుగుదేశం నాయకులు పోరుబాట పట్టాలని కోరుతూ, సమస్యలు ఎదురైనప్పుడు తన దృష్టికి తీసుకువస్తే వారి పక్షాన నిలబడతానని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు.

టీడీపీ అధికారంలోకి తెచ్చేందుకు కృషి : లెనిన్

విశాలాంధ్ర-పెదపారుపూడి : టీడిపిని 2024 లో అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తానని పామర్రు నియోజకవర్గ ఎస్సి సాధికార సంఘ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన దగాని లెనిన్ శనివారం అన్నారు. మండలంలోని పాములపాడు శివారు దూళ్లవానిగూడెం గ్రామానికి చెందిన లెనిన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ తనపై ఎంతో నమ్మకముతో అప్పగించిన ఈ బాధ్యతను స్వీకరించి రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో వర్ల కుమార్ రాజాను ఎమ్మెల్యేగా గెలిపించి పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు గిఫ్టుగా అందిస్తానని లెనిన్ ప్రతిన పూనారు. తనకు పార్టీలో స్థానం ఏర్పాటు చేయడానికి కృషిచేసిన టిడిపి పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్ రాజాకు, మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరికి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞత తెలిపారు.

హరీషకు హర్షాతిరేకాలు

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని దోసపాడు గ్రామానికి చెందిన జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ మాజీ సభ్యురాలు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మూల్పూరి హరీషను ఆ పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినందుకు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ కు, వైసిపి అధినేత ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతున్నట్లు హరీష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హరీష మాట్లాడుతూ 2024 అసెంబ్లీ ఎన్నికలలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ను గతంలో కంటే అత్యధిక మెజార్టీతో గెలిపించడానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు.

అయ్యంకిలో త్రిబుల్ ఐటీ విద్యార్థిని కీర్తికి ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం అయ్యంకి గ్రామానికి చెందిన రాజులపాటి కీర్తి కడప జిల్లాలోని ఇడుపులపాయి త్రిబుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించినందుకు ఆ విద్యార్థినిని శనివారం సర్పంచ్ ఆధ్వర్యంలో అభినందించారు. కీర్తి 2022-23 విద్యా సంవత్సరంలో పెదసనగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదివి 558 మార్కులతో మొదటి స్థానం సాధించింది. సర్పంచ్ నాగనబోయిన సునీల్ కుమార్ రూ.5 వేలు, జడ్పీటిసి రాజులపాటి పార్వతి రూ. 5 వేలు, గ్రామ మాజీ సర్పంచ్ తాతా దుర్గాప్రసాద్ రూ.2 వేలు, ఆరేపల్లి వెంకటేశ్వరరావు రూ.2 వేలు, రాజులపాటి పెద్ద మస్తాన్ రూ.1 వేయి కలిపి 15 వేలు రూపాయలు ఆ పేద విద్యార్థునికిఅందజేశారు.

లీటర్ పెట్ బాటిల్‌ను రూ.137 వద్ద విడుదల చేసిన గోల్డ్ డ్రాప్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఏపీలో లీటర్ పెట్ బాటిల్ రూ.137కు విడుల చేసినట్లు గోల్డ్ డ్రాప్ ప్రకటించింది. సేల్స్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ మితేష్ లోహియా మాట్లాడుతూ, ఎల్లప్పుడూ వినియోగదారుల అవసరాలను గుర్తెరిగి వాటిని తీర్చడాన్ని గోల్డ్ డ్రాప్ విశ్వసిస్తుంది. ఆ నమ్మకానికి కొనసాగింపు 1 లీటర్ పెట్ బాటిల్. అన్ని భద్రతా చర్యలనూ పరిగణలోకి తీసుకుని వినియోగదారు ల కోసం తీర్చి దిద్దిన ఒక సౌకర్యవంతమైన ప్యాక్ ఇది " అని అన్నారు. స్వచ్ఛమైన నూనెను వినియోగదారులు వినియోగిస్తున్నారని తెలిపారు.

పిల్లలను బడిలో చేర్పించాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో నూటికి నూరు శాతం బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డి ఆర్ ఓ ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, క్షేత్రాధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి విద్య, వైద్యం, వైయస్సార్ లైవ్ టైం అచీవ్మెంట్ అవార్డులు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ పరిధిలో విద్యావ్యవస్థను పటిష్టపరుచుటలో భాగంగా బడి, కళాశాల ఈడు పిల్లలందరూ నూటికి నూరు శాతం విద్యాసంస్థల్లో చేర్పించాలని, ఏ ఒక్కరు కూడా చదువుకోకుండా విద్యాసంస్థల బయట ఉండరాదన్నారు. మండలాల వారీగా ఏ ప్రభుత్వ పాఠశాలలో, కళాశాలలో ఎంతమంది చేరాల్సి ఉంది, ఎంతమంది చేరారు, ఇంకా ఎంతమందిని చేర్చాలి అనే అంశాల పైన లోతుగా విశ్లేషించి తప్పనిసరిగా అందరిని విద్యాసంస్థల్లో చేర్పించాలన్నారు. ఇందుకోసం మండల విద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని నూటికి నూరు శాతం లక్ష్యాలను సాధించాలన్నారు. జిల్లాలో బాగా బోధన చేస్తున్న ఉపాధ్యాయులు, లెక్చరర్లను గుర్తించి వారి ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ అంశంపై సోమవారం విద్యాశాఖ ఎంఈఓ లతో సమావేశం నిర్వహించి సమగ్ర ప్రణాళికను రూపొందించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ వైద్యశాలలు, సర్వజన ఆసుపత్రులు అన్నింటిలోనూ ఆరోగ్యశ్రీ సేవలు మరింత మెరుగుపడాలన్నారు. ముఖ్యంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాధారణ ప్రసవాలు తప్పనిసరిగా చేయాలన్నారు. తద్వారా ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నారో, ఏ తేదీన ప్రసవం జరిగే అవకాశం ఉందనే సమాచారం అందుబాటులో ఉండాలని, వారికి క్రమం తప్పకుండా అవసరమైన వైద్య సేవలు అన్ని సక్రమంగా అందించాలన్నారు. ప్రసవాలలో సాధారణమైనవి, హై రిస్క్ లో ఉన్నవి గుర్తించి వాటి వివరాలను పై స్థాయిలో ఉన్న వైద్యశాలలకు పంపించాలన్నారు. ఏ ప్రభుత్వ వైద్యశాలలో ఎన్ని ప్రసవాలు జరగాలి, ఎన్ని జరుగుతున్నాయి, ఎలా జరుగుతున్నాయి అనే విషయాల పైన సంపూర్ణ పర్యవేక్షణ ఉండాలన్నారు. వైయస్సార్ లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డులు పొందుట కోసం సమాజ సేవా కార్యక్రమాల్లో విశేషంగా కృషిచేసిన వ్యక్తుల గుర్తించి ప్రతిపాదనలు రెండు రోజుల్లో పంపాలని సూచించారు. ఈ టెలికాన్ఫరెన్స్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మత్స్యకారుల రక్షణకు ప్రత్యేక రక్షణ పరికరాలను ఇవ్వాలి

విశాలాంధ్ర-నాగాయలంక : సముద్రంలో చేపలు వేటాడే మత్స్యకారులప్రాణ రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం నాగాయలంకలోని ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల వద్ద సముద్రములో చేపల వేటాడే పలు బోట్లను పరిశీలించారు. సముద్రంలో తరచూ బోట్లు ప్రమాదాలకు గురై మత్స్యకారులు మరణించడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. చేపలవేటతో దేశానికి విదేశ మారక ద్రవ్యంతో పాటు బలవర్ధకమైన ఆహారం అందించే మత్స్యకారుల ప్రాణ రక్షణకు ప్రభుత్వం అవసరం మైన చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. సముద్రపు వేట జీవనాదా రంగా జీవించే ఈ మత్స్యకారులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని అన్నారు. ప్రతి చేపల బోటు లో వేటాడే కళాసీల ప్రాణరక్షణకు సెక్యూరిటీ పరికరాలు ఉంచాలన్నారు. ఫిక్సింగ్ నేవిగేషన్ లైట్లు, చేపల వేట చేయుటకు తెల్ల లైట్లు అమర్చుకోవాలని మత్స్యకారులను కోరారు. రెండు లైఫ్ బోయాస్,ప్రతి కళాసీ కి ఒక లైఫ్ జాకెట్ తో పాటు అవసరమైన అన్ని నేవిగేషన్ పరికరాలను ఉచితంగా అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను లకనం డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యకార నాయకులు నాగిడి తాతారావు, కర్రి కృష్ణమూర్తి, కొల్లు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

దొంగ దీక్షలకు రెడీగా ఉండండి

విశాలాంధ్ర-అవనిగడ్డ : నియోజకవర్గంలో ఏదైనా మంచి కార్యక్రమం చేపట్టినపుడల్లా ప్రజల దృష్టిని మరల్చేందుకు ఛీప్ ట్రిక్కు చేయడం మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అలవాటేనని, మరో రెండు దొంగ దీక్షలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఎద్దేవా చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు విలేఖరులతో మాట్లాడుతూ టీడీపీ హయాంలో 22ఎలో చేర్చిన భూములకు సీఎం జగన్మోహన్ రెడ్డి ముక్తి కల్పించిన సందర్భంగా అవనిగడ్డలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు ముందు పొలాల వెంట తిరిగి ఏదో అయిపోయినట్టు ప్రచారం చేశారన్నారు. ఇప్పుడేమో దొంగదీక్ష చేశారని ఎద్దేవా చేశారు. త్వరలోనే ఏటిమొగ - ఎదురుమొండి వారధి నిర్మాణంకు శంకుస్థాపన, అవనిగడ్డ - కోడూరు రహదారి పనులు ప్రారంభిస్తామని ఈ రెండు పనులకుముందు రెండు దొంగ దీక్షలు చేసేందుకు బుద్ధప్రసాద్ రెడీగా ఉండాలని సింహాద్రి ఎద్దేవా చేశారు. మండపాకల కాలువకు అవకాశం లేదని చెప్పిన బుద్ధప్రసాద్ తాను సచివాలయాల చుట్టూ తిరిగి పంటకాలువకు నిధులు తీసుకొస్తే 70 శాతం పనులు పూర్తయ్యాక పనులు ఆపేయించిన ఘనుడు బుద్ధప్రసాద్ అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌరుముచ్చు ఉమా, వైఎస్సార్సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ గుర్రం బసవయ్య, అవనిగడ్డపట్టణ కన్వీనర్ అన్నపరెడ్డి రాందాస్, మాజీ ఉప సర్పంచ్ గాజుల జయగోపాల్ పాల్గొన్నారు.

నాయిబ్రహ్మణులకు న్యాయం చేయాలి : దేవరపల్లి

విశాలాంధ్ర-గుడివాడ : ఇటివల ప్రభుత్వం జీవో నెంబర్ 50ను అములోకి తీసుకు వచ్చినప్పటికి నాయి బ్రహ్మణులకు ఎందుకు ఉపయోగపడడం లేదని నాయీ బ్రహ్మణ సవిత సమాజం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి కోటి పాదయాత్ర చేస్తున్న నారా లోకేష్ అందజేశారు. శనివారం నూజివీడులో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలో నాయీ బ్రహ్మణ సవిత సమాజం రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి కోటి పాల్గొని అనతరం అయనకు విన్నతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీసాయి నాయీ బ్రహ్మణ సేవా సంఘం నియోజకవర్గ అధ్యక్షులు విక్కుర్తి పోతురాజు, వాయిద్య కాళాకారులు, పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిళ్లు దగ్ధం

విశాలాంధ్ర-అవనిగడ్డ: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ శనివారం అవనిగడ్డ శివారు పులిగడ్డ వెళ్లే రహదారి పక్కన ఉన్న రెండు పూరి ఇల్లు అగ్నికి ఆహుతయ్యాయి. కుటుంబ సభ్యులకు కట్టుబట్టలే మిగిలాయి. సూరగం సుబ్రహ్మణ్యం కేశాని దానయ్య లకు చెందిన పూరి ఇల్లు విద్యుత్ వైర్లు నుంచి వచ్చిన మంటలకు దగ్ధమయ్యాయి. ఇంట్లోని వారు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. రెండిళ్లవారు కట్టుబట్టలతో మిగిలారు ఇంటి ఇళ్లలోని వస్తువులు మంటల్లో ఆహుతి అయ్యాయి. ఐదు లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అవనిగడ్డ అగ్నిమాపక కేంద్రం అధికారి పీఎస్సీ ప్రసాద్ తెలిపారు. అగ్ని ప్రమాద బాధ్యత కుటుంబాలను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు పరామర్శించి ప్రభుత్వపరంగా సాయం అందేటట్లు చేస్తానని చెప్పారు.

మదర్‌థెరిస్సా 113వ జయంతి

విశాలాంధ్ర-గుడివాడ : నిరుపేదలకు అమ్మగా, అనారోగ్యాల బారిన పడిన వారిని అక్కున చేర్చుకున్న గొప్ప మాతృమూర్తి నోబుల్ బహుమతి అవార్డు గ్రహిత మధర్‌థెరిస్సా అని జనసేన నాయకులు డా॥ మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అన్నారు. మదర్‌థెరిస్సా 113వ జయంతి సందర్భంగా శనివారం స్థానిక తుమ్మల రాంబ్రహ్మం మున్సిపల్ పార్కులోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కె మాట్లాడుతూ ప్రభువు చూపిన మార్గంలో పయనించి అభాగ్యుల పట్ల ప్రేమ, కరుణ కురిపించిన మాతృమూర్తి మధర్‌థెరిస్సా అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు షేక్ మీరా షరీఫ్, నూనె అయ్యప్ప, చరణ్ తేజ్, నాగసాయి, శివ, చరణ్, ఆర్య మాస్టర్, తదితరులు పాల్గొన్నారు. ఎంపిడివో కార్యాలయంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మధర్ థెరిస్సా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పరిషత్ అధ్యక్షురాలు గద్దె పుష్ప రాణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వెంకటరమణ, సిబ్బంది, పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర-అవనిగడ్డ: దీనజనుల సేవలో తరించిన గొప్ప సేవా మూర్తి మదర్ థెరిస్సా అని గాంధిక్షేత్రం కమిటీ కార్యదర్శి కూనపరెడ్డి చంద్రశేఖర్ అన్నారు. శనివారం అవనిగడ్డ గాంధిక్షేత్రంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవామూర్తి మదర్ థెరిస్సా యుగోస్లేవియా లో పుట్టి కలకత్తా మురికి వీధులలోని అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపారని, దివిసీమ ఉప్పెన సమయంలో దివిసీమ ప్రాంతంలో పర్యటించి ఉప్పెన భాదితులకు సేవా హస్తం అందించారని అన్నారు. మానవ జాతికి మదర్ థెరిస్సా అందించిన సేవా స్ఫూర్తిని అందరూ అలవరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొల్లూరి వెంకటేశ్వరరావు, ఘంటసాల రాజమోహనారావు, మాచవరపు ఆదినారాయణ, లుక్కా శ్రీను, మండలి రామమోహనారావు తదితరులు పాల్గొన్నారు.

డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా ద్వారా హైజీన్ ఒలింపియాడ్ రెండవ ఎడిషన్ ప్రకటన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తమ ఫ్లాగ్‌షిప్ ప్రచారం డెట్టాల్ బనేగా స్వస్త్ ఇండియా ద్వారా భారతదేశంలో అతి పెద్ద పరిశుభ్రత ఒలింపియాడ్ డెట్టాల్ హైజీన్ ఒలింపియాడ్ రెండవ ఎడిషన్ ను ప్రపంచంలో ప్రముఖ వినియోగదారుల ఆరోగ్యం పరిశుభ్రత సంస్థ రెకిట్ ప్రకటించింది. పిల్లల్లో అనారోగ్యాలను నివారించడంలో పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి అవగాహనను పెంపొందించే లక్ష్యంతో, ఈ విలక్షణమైన చొరవ పిల్లలకు పరిశుభ్రత ఆరోగ్యకరమైన అలవాట్ల గురించి తెలుసుకోవడానికి ఒక పరస్పర చర్యా వేదికను అందిస్తుంది.

మోదీ, జగన్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గర పడ్డాయి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ముస్లిం దర్గా-వక్ఫ్ ఆస్తులను అన్యమతస్తుల నుండి స్వాధీనం చేసుకుని వాటిని అభివృద్ధి చేసి పేద ముస్లింలకు అందజేయాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ డిమాండ్ చేశారు. ముస్లిం దర్గా-వక్ఫ్ పరిరక్షణ కోసం గాలిబ్ షాహిద్ దర్గా భూములను అన్యతలస్థలు నుండి ఖాళీచేయాలని డిమాండ్ చేస్తూ శనివారం ధర్నాచౌక్‌లో అన్న వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ,నవరంగ్ కాంగ్రెస్ పార్టీ,కాంగ్రెస్ పార్టీ, ముస్లీం సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా జలీల్ మాట్లాడుతూ ముస్లీం హక్కుల పరిరక్షణ కోసం సెక్యూలర్ పార్టీలతో కలసి దర్నా చేపట్టామన్నారు.ముస్లీం లను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని అన్నారు. ముస్లిం మైనారిటీలలో మహిళలు అధిక సంఖ్యలో చదువుకు దూరంగా ఉన్నవారే ఉన్నారన్నారు. గతంలో అమలు చేసిన 27 సంక్షేమ పథకాలను వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దుచేసి ఇప్పుడు కొన్ని పథకాలకు షరతులు విధిస్తూ అమలు చేస్తామని చెప్పి ముస్లిం మైనారిటీలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైకాపాను, కేంద్రంలో భాజపాను ఇంటికి సాగనంపై రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.ఈ ధర్నాలో కార్యక్రమంలో అన్న వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ మహబుబ్ బాషా,జనసహాయక శక్తి పార్టీ అధ్యక్షులు షేక్ ఉమర్ బాషా,ఇతర నాయకులు పాల్గొన్నారు.

వెయ్యి కోట్లకు పైగా మార్కెట్ క్యాపిటలైజేషన్ సాధించిన లింకన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: భారతదేశంలోని ప్రముఖ ఔషధ కంపెనీలలో ఒకటైన లింకన్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ తొలిసారిగా రూ. 1000 కోట్లకు పైగా మార్కెట్ కేపిటలైజేషన్ సాధించిన కంపెనీల జాబితాలోకి ప్రవేశించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటన తెలిపారు. 2024 మొదటి త్రైమాసికంలో కూడా కంపెనీ అద్భుతమైన ఆపరేషనల్, ఫైనాన్షియల్ పనితీరు కనబరిచింది. ముందు ఏడాదితో పోలిస్తే నికరలాభంలో 26.7 శాతం వృద్ధి, ఈబీఐటీడీఏ 21.4 శాతం మొత్తం ఆదాయంలో 10.3 శాతం వృద్ధిని సాధించిందన్నారు. గుజరాత్ లోని మెహసానాలో సెఫలోస్పోరిన్ ప్లాంట్ విస్తరణను కంపెనీ విజయవంతంగా పూర్తి చేసిందనీ వివారించారు.

చిరు వ్యాపారులకు రుణాలు: గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ



విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : చిరు వ్యాపారులకు రుణాలను కల్పించి వారి అభివృద్ధి ధ్యేయంగా గోదావరి కృష్ణ కో-ఆపరేటివ్ సొసైటీ పనిచేస్తుందని సొసైటీ చైర్మన్ మేడూరి జీవన్ వెంకట్రావు తెలిపారు. ఇబ్రహీంపట్నం లో తమ11వ బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇన్కమ్ టాక్స్ రిటర్న్ చేసే పెద్ద సంస్థలకు, ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఇప్పటివరకు బ్యాంకుల నుండి రుణ సౌకర్యం పొందే అవకాశం ఉందని, కానీ గోదావరి కృష్ణ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా చిరు వ్యాపారులు, చిన్నతరహా సంస్థల కు రుణాలను కల్పించే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నామని, అతి తక్కువ వడ్డీతో చిరు వ్యాపారుల ఆదాయాలను పరిగణలోనికి తీసుకొని వారికి రుణాలను కల్పించడం జరుగుతుందని తెలిపారు.

మదర్ థెరిస్సా జయంతి

విశాలాంధ్ర-గంపలగూడెం : గంపలగూడెం మండలం పెనుగొలను ప్రాథమిక బిసిపాఠశాలలో శనివారం షిరిడి సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో భారతరత్న మదర్ థెరీసా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె జీవితం మొత్తం పేదలకు, అనాథలకు, మరణశయ్య పై ఉన్న వారికి సేవలు చేసిన గొప్ప మానవతావాదని, నోబుల్ శాంతి, భారతరత్న పురస్కారాలు పొందారని పాఠశాల హెచ్ఎం. యలగందుల. శ్రీనివాసరావు కొనియాడారు. ఉపాధ్యాయులు పి. రవికుమార్, సాయిబాబా కమిటీ ఆర్గనైజర్ వి. కృష్ణ, పాఠశాల సిబ్బంది కుంచం. వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేల కోట్లు దాటిన బజాజ్ ఫైనాన్స్ ఫిక్సిడ్ డిపాజిట్లు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : భారతదేశంలో అగ్రశ్రేణి వైవిధ్యభరితమైన నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల్లో ఒకటైన బజాజ్ ఫిన్‌సర్వ్ లో భాగమైన బజాజ్ ఫైనాన్స్ లిమిటెడ్ తమ ఫిక్స్ డ్ డిపాజిట్ల ఖాతా రూ. 50,000 కోట్ల మైలురాయిని దాటినట్టు బజాజ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఫిక్స్ డ్ డిపాజిట్స్, ఏఎంపి, ఇన్వెస్ట్‌మెంట్స్ సచిన్ సిక్కా తెలిపారు. బజాజ్ ఫైనాన్స్ కు అయిదు లక్షల మందికి పైగావినియోగదారులు ఉన్నారన్నారు. ప్రతి డిపాజిటర్ 2.87 డిపాజిట్లను, మొత్తంగా 14 లక్షల డిపాజిట్లను కలిగి ఉన్నామన్నారు. క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ దీర్ఘకాలిక రుణ కార్యక్రమం నిమిత్తం అత్యున్నతమైన ఏఏఏ/ స్టేబుల్ క్రెడిట్ రేటింగ్‌ను బజాజ్ ఫైనాన్స్ కలిగి ఉందన్నారు. క్రిసిల్, ఐసిఆర్ఎ, కేర్, ఇండియన్ రేటింగ్స్ ద్వారా తమ స్వల్ప కాలిక రుణ కార్యక్రమం నిమిత్తం ఏ1ను, క్రిసిల్, ఐసిఆర్ఎల నుంచి తమ ఫిక్స్ డ్ డిపాజిట్స్ కార్యక్రమం నిమిత్తం ఏఏఏ(స్టేబుల్) రేటింగ్ ను కలిగి ఉందన్నారు. ఆకర్షణీయమైన వడ్డీ రేట్లతో

పేదలకు బ్యాంకింగ్ సేవలు



విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : పేద ప్రజలకు బ్యాంకింగ్ సేవలను మరింత సులభతరం చేయడమే తమ లక్ష్యమని పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ వ్యవస్థాపక చైర్మన్ చుక్కపల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. తమ బ్యాంకు ఆధ్వర్యంలో పేద సామాన్య మధ్యతరగతి ప్రజలకు రుణాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం లయోలా కాలేజీలోని దేవయ్య ఆడిటోరియంలో పీపుల్స్ మేక క్రెడిట్ సొసైటీ మహాజన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బ్యాంకు ఖాతాదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడుతూ తమ సంస్థ స్థాపించి 10 పదేళ్ళు పూర్తయిందని ఈ పదేళ్ల కాలంలో పేద ప్రజలకు సామాన్య మధ్య తరగతి ప్రజలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేశామని తెలిపారు. ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఆమె మాట్లాడుతూ 2022- 23 ఆర్థిక సంవత్సరంలో సొసైటీ రూ.2,37,76,388/- లాభాన్ని గడించిందని ఇది సొసైటీ చరిత్రలో అనగా గత పది సంవత్సరములలో ఈ లాభాలు అత్యధికమని, మనసొసైటీ అభివృద్ధికి చిహ్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో కెనరా బ్యాంక్ మాజీ డైరెక్టర్ జి వి సాంబశివరావు, పీపుల్స్ మ్యాక్ క్రెడిట్ సొసైటీ విజయవాడ శాఖ చైర్మన్ ఏ.ఎల్లారావు, ముఖ్య కార్యనిర్వహణ అధికారి కే కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సేవలో అమ్మ ...

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తన సేవలతో అందరికీ అమ్మ అయిన మదర్ థెరిస్సా సేవలను స్ఫూర్తిగా తీసుకోవాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు వసంత కుమార్ అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 113వ జయంతిని వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంత కుమార్ మాట్లాడుతూ కుష్టు బాధితులకు ఆమె అందించిన సేవలు మరులేనివన్నారు. పేదలందరినీ ఆమె అమ్మలా ఆదరించారన్నారు. అనంతరం మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి కొండాయ గుంట రాము, గుర్రం ఏడు కొండలు,బి, ఆంజనేయ రాజు,సి హెచ్ పుల్లా రెడ్డి,నాగ మల్లిక, షఫీ,రాజా రావు,విశ్వేశ్వరయ్య, బత్తిన సీతా రామయ్యా,పోతుల విల్సన్ రాజు,బి,ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

విజయవాడలో కారు బీభత్సం

స్కూల్ ఆటోపైకి దూసుకెళ్లిన కారు - తల్లికి తీవ్రగాయాలు, చిన్నారులకు స్వల్ప గాయాలు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ బీఆర్టీసీ రోడ్డులో కారు భీభత్సవం సృష్టించింది. శనివారం ఉదయం కేంద్రీయ విద్యాలయం స్కూల్ వద్ద ఆటోలో వెళ్తున్న విద్యార్థులపై దూసుకెళ్లింది. వేగంగా దూసుకొచ్చిన కారు ఆదుపుతప్పి స్కూల్ ఎదురుగా ఉన్న బారికేట్లు, వాహనాలతో పాటు విద్యార్థులపై దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. విద్యార్థి తల్లి జ్యోత్స్నకు తల్లకు బలమైన గాయం కావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించారు. కారు యజమానిని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. ఒక ప్రమాదం జరిగిన స్థలంలో పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు చాలా మంది ఉన్నారు. ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కరెన్సీనగర్‌కు చెందిన రామ్‌చరణ్ తన కుటుంబ సభ్యులను రైల్వేస్టేషన్‌కు వదలి తిరిగి బీఆర్టీసీ వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మదర్‌థెరిస్సాకు నివాళులు

విశాలాంధ్ర-విజయవాడ : మదర్ తెరిస్సా 111వ జయంతి సందర్భంగా సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. 47వ డివిజన్ ఆర్ ఐజాక్ ఆధ్వర్యంలో శనివారం ట్రైనర్ పేట, ఐజాక్ వీధి నందు మదర్ థెరీసా 111వ జయంతిలో వేడుకలు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ డివి రమణబాబు, సీపీఐ డివిజన్ కార్యదర్శి ఆర్ మైఖ్ ల్, చిత్రపటానికి పూలమాలవేసి నివాళు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నలుగురికి సహాయం చేయటానికి డబ్బు మాత్రమే ఉంటే సరిపోదని మంచి మనసు మానవత్వం ఉంటే చాలు అనే ప్రపంచానికి చాటి చెప్పిన మానవతా మూర్తి మదర్‌థెరిస్సా అని కొనియాడారు. ప్రేమమయి, త్యాగశీలి, విశ్వమాత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ప్రభుదాస్, ఓ బాబు, టీ సురేష్, కే బాబు, ఎన్ శ్యామ్, కే రాము తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనాథ్‌కు నివాళులు

విశాలాంధ్ర-విజయవాడ (తిరువూరు) : మాజీ మంత్రి కొత్తపల్లి శ్యామల జవహర్ సోదరుడు టీడీపీ నాయకులు కొత్తపల్లి రవీంద్రనాథ్‌కు సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఇటీవల మరణించిన రవీంద్రనాథ్ సంస్మరణ సభ ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజక వర్గం గానుగపాడు గ్రామంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సీపీఐ నాయకులు ముందుగా రవీంద్రనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూముకృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరివెంకటేశ్వరరావు, సీపీఐ తిరువూరు నియోజకవర్గ పార్టీ కార్యదర్శి షేక్ నాగుల మీరా, తిరువూరు పట్టణ పార్టీ కార్యదర్శి మాలపాటి ఉదయ్ తదితరులు ఉన్నారు.

మాతృభాషతోనే మనో వికాసం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విద్యార్థులు మాతృభాషతోనే మనో వికాసాన్ని సాధించగలరని కేంద్ర సాహిత్య అకాడమీ డెప్యూటీ సెక్రటరీ డాక్టర్ నారాయణం సురేష్‌బాబు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని తెలుగు భాషా దినోత్సవం వారోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హజరైన డాక్టర్ నారాయణం సురేష్‌బాబు మాట్లాడుతూ తెలుగు భాషా మాధుర్యం అపూర్వమైనదన్నారు. దేశంలోని ఇతర భాషలకు లేని ఎన్నో ప్రత్యేకతలు తెలుగు భాషకు ఉన్నాయన్నారు. మాతృభాషను నిర్లక్ష్యం చేయటం ద్వారా మన వికాసానికి మనమే అడ్డుపడినవారమవుతామన్నారు. మాతృభాషలో విద్యాబోధనపై కేంద్ర మానవ వనరుల శాఖ అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. సీబీఎస్‌ఇ ఇప్పటి వరకూ ఇంగ్లీష్‌లో మాత్రమే బోధన ఉండేదన్నారు. కానీ రానున్న రోజుల్లో మాతృభాషలోనే సీబీఎస్ఈ సిలబస్‌ను మార్పు చేయటానికి కసరత్తు జరుగుతుందన్నారు. అదేవిధంగా బీహార్ వంటి రాష్ట్రంలో ఇప్పటికీ అక్కడి స్థానిక భాషగా ఉన్న మైథిలి భాషలో అక్కడి ప్రజలు మాట్లాడతారని వివరించారు. స్థానిక భాషలో మాట్లాడితే ఆ భాష మరింత వికాసం చెందటంతో పాటుగా మాట్లాడే వారి ఉన్నతికి అండగా నిలుస్తుందన్నారు. మాతృభాషా వికాసానికి గిడుగు రామ్మూర్తి అందించిన చేయూతను సభకు వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ మాట్లాడుతూ మానవ వికాసానికి ఆయా మాతృభాషలే సాధనాలన్నారు. అధ్యాపకులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ మాట్లాడుతూ తెలుగు భాష అద్భుతమైనదన్నారు. తెలుగు భాషా వికాసానికి అనేక మంది ప్రముఖులు అపూర్వమైన సేవలందించారని వివరించారు. మాతృభాషా వికాసానికి అందరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ టీ భాగ్యకుమార్, అధ్యాపకులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ జేవీ చలపతిరావు, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆహా క్యాంటిన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : పట్టణపేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) సహకారంతో నగరంలోని ఇంద్రకీలాద్రి పట్టణ సమాఖ్య కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్ వద్ద ఆహా క్యాంటిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన ఇంటి తరహ ఆహార పదార్థాలను పేదలకు అందుబాటు ధరల్లో అందించడం ఈ ఆహా క్యాంటీన్ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. దద్దోజనం, పులిహార, పూర్ణం బూరెలు, గారెలు వేజిటేబుల్ బిర్యానీ వంటి పదార్థాలు అమ్మకానికి ఉంచినట్లు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారంతో పాటు మహిళలకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ఆహ కాంటీన్ పనిచేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బీ.పుణ్యశీల యూసీడీ పీవో శకుంతల, ఇంద్రకీలాద్రి పట్టణ సమాఖ్య ఆఫీస్ బేరర్స్, మెప్మా సిబ్బంది, స్వయం సహాయక సంఘ మహిళలు, రిసోర్స్ పర్సన్‌లు పాల్గొన్నారు.

మహిళల ఉపాధికి కుట్టు శిక్షణ

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర పాలక సంస్థ సర్కిల్-2 పరిధిలోని 58వ డివిజన్ ఆంధ్రప్రభ కాలనీల్లోని కమ్యూనిటీ హాల్‌లో యూసీడీ విభాగం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానిక ఎమ్మెల్యే ఎం.విష్ణువర్ధన్ తెలిపారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు నెలలు పాటు శిక్షణ కొనసాగుతుందని, శిక్షణ అనంతరం అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ శైలజ, యూసీడీ పీవో కే.శకుంతల, సర్కిల్-2 సీడీవో జీ.జగదీశ్వరి, వీఎంసీ టెక్నికల్ ఫణి, రమ్య,సోషల్ వర్కర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

నాయిబ్రాహ్మణులకు స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలి

విశాలాంధ్ర-కంచికచర్ల: నాయి బ్రాహ్మణులకు రాష్ట్రంలో ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఉమ్మడి కృష్ణ ఎన్టీఆర్ జిల్లా రాష్ట్ర నాయి బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి పరస సూర్య సత్యనారాయణ తెలిపారు. శనివారం మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులకు శాసనసభలో ప్రాతినిధ్యంతోపాటు దేవాలయాలలో నాయి బ్రాహ్మణ ట్రస్ట్ బోర్డులలో స్థానం కల్పించాలని ఎమ్మెల్సీ సీట్లు కేటాయించాలని అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. గతంలో బీసీలకు సర్పంచులు మండల అధ్యక్షులు మున్సిపల్ అధ్యక్షుల స్థానాలలో నియమించారని ఈ మధ్యకాలంలో ఎవరిని నియమించలేదని ఆయన ఆరోపించారు. ఇకనైనా నాయి బ్రాహ్మణులకు శాసనసభతోపాటు స్థానిక సంస్థల్లో కూడా అవకాశం కల్పించాలని కోరారు.

వాంబేకాలనీలో చోరీ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): ఇంటి తాళం పగలకొట్టి గుర్తుతెలియని దండుగులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శనివారం పాయకాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వాంబే కాలనీకి చెందిన దుర్గాప్రసాద్ కిరాణా దుకాణం నడుపుతున్నాడు. కొంత కాలం క్రితం భార్య చనిపోవడంతో ఇంటికి తాళం వేసి దుకాణంలోనే ఉంటున్నాడు. ఉదయం ఇంటకి వచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం పగల కొట్టి ఉంది. ఇంట్లో ఉండాల్సిన 1కేజీ వెండీ. 11గ్రాముల బంగారం అభరాణాలు చోరికి గురైయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాయకాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చైన్ లింకుతో రూ.కోట్ల మేర టోకరా!

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : అత్యాశతో కొండపల్లిలోని ఎస్టీ కాలనీకి చెందిన సుమారుగా 400 మంది 2 కోట్ల 50 లక్షల రూపాయలకు పైగా చైన్ లింక్ కంపెనీకి చెల్లించి బలయ్యారు. కొందరు వ్యక్తులు బెంగళూరులో మేరేస్కు అనే కంపెనీ ఒక కంటైనర్‌ను కొనుగోలు చేసి దాని ద్వారా ఆహార పదార్థాలను విదేశాలకు ఎగుమతి చేసే వ్యాపారానికి పెట్టుబడిగా మీరు కొంత సొమ్మని వెచ్చించినట్లయితే రెట్టింపు సొమ్మును పొందవచ్చునని నమ్మబలికారు. కొంతమంది ఏజెంట్లను నియమించుకొని ఎస్టీ కాలనీ ప్రజల నుండి రెండు కోట్ల రూపాయలకు పైగా వసూలు చేశారు. దీనికి ఒక యాప్‌ను కూడా క్రియేట్ చేశారు. ప్రజలు డబ్బులు కట్టిన కొన్ని రోజులకు యాప్‌లో రెట్టింపు సొమ్ము జమ అవుతున్నప్పటికీ విత్ డ్రా చేసేకునే మాత్రం అవకాశం లేకుండా చేశారు. డబ్బులు కట్టించుకున్న వారిని ప్రశ్నించగా వారు కూడా చేతులెత్తేశారు. ఏమి చేయాలో దిక్కుతోచని సందర్భంలో ఆ కంపెనీ పేరుతో స్థానిక పారిశ్రామిక వాడ నుండి ఒక వెహికల్ వస్తుందని తెలుసుకున్న స్థానికులు ఆ కంటైనర్ వాహనాన్ని అడ్డుకొని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషనకు తరలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూలీనాలి చేసుకునే వాళ్ళమని బాధితులు స్టేషన్ ముందు బోరున విలపిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.

గోడ మీద పిల్లి ఎవరో ప్రజలకు తెలుసు : కొండ్రగుంట

విశాలాంధ్ర-వీరులపాడు : జుజ్జూరులో మండల కార్యాలయాల ఏర్పాటు సందర్భంగా ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ టీడీపీపై చేసిన విమర్శలను ఖండిస్తూ టీడీపీ మండల అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాసకుమార్ ఆధ్వర్యంలో శనివారం జుజ్జూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. మండల కేంద్రం మార్పు విషయంలో ఏ రోజైన ప్రతిపక్ష పార్టీల అభిప్రాయాలను తీసుకున్నారా?, నియంతలా ఏకపక్షంగా నిర్ణయాలు మీరు తీసుకొని ప్రతిపక్ష టీడీపీ తన వైఖరి చెప్పలేదనడం హాస్యాస్పదంగా ఉందని మండల తెదేపా అధ్యక్షుడు కొండ్రగుంట శ్రీనివాస్‌కుమార్ అన్నారు. గ్రామ తెదేపా తరపున మా నాయకులు మండల కేంద్రం ఏర్పాటుకు అంగీకారం తెలిపిన విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. కనీసం మీరు మండల మార్పు విషయంలో అఖిలపక్షాన్ని సంప్రదించకుండా,వారి అభిప్రాయాన్ని తెలుసుకోకుండా మీరు మాపై ఏ విధంగా విమర్శలు సంధిస్తారో తెలపాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండల సీనియర్ నేత చీరాల భరత్ రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం మీరు జుజ్జూరు లో నిర్వహించిన కార్యక్రమం ప్రజలందరి కార్యక్రమమా లేక మీ పార్టీ కార్యక్రమమా ?, మీ పార్టీ కార్యక్రమం లా మీ ప్రచార రథం, మీ పార్టీ పాటలు పెట్టడం దేనికి సంకేతమని అడిగారు. జుజ్జూరు కు నిజంగా మండల కేంద్రాన్ని మార్చారా లేక ప్రజలను మోసం చేసేందుకే రాజధాని విషయంలో మూడు ముక్కలాట తరహాలో మండలం విషయంలో రెండు ముక్కల డ్రామాలకు తెరతీసారా? అని ప్రశ్నించారు. ఇక మండల అభివృద్ధి విషయానికి వస్తే దాచవరం -జుజ్జూరు రహదారి, పొన్నవరం -జమ్మవరం రహదారి, చౌటపల్లి - జయంతి రహదారి, తిమ్మాపురం రహదారి ఇలా పలు రహదారులు మా హయాంలో నిర్మించాం. కంచికచర్ల - పెద్దాపురం రహదారి అస్తవ్యస్తంగా ఉంటే మొద్దు నిద్ర పోతున్న మిమ్మల్ని మా నిరసనల ద్వారా మేల్కొలిపితే ముక్కుతూ మూలుగుతూ రహదారి నిర్మించారు,అది కూడా అటు ఒక కిలోమీటర్, ఇటు ఒక కిలోమీటర్ వదిలేసారు ఇదేనా మీ సమర్థత అని అని అన్నారు. ఈ సమావేశం లో నాయకులు మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కాపా రాంబాబు, మాజీ వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి వీరబాబు, నిమ్మల రాజేంద్ర, మాదల కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సభ్యుడు సర్వేశ్వరరావుకు భార్య వియోగం

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలంలోని చీమలపాడు గ్రామశాఖ సీపీఐ సభ్యుడు చల్లా సర్వేశ్వరరావు భార్య చల్లా బాయమ్మ (42) అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వ హాస్పటల్లో ఇటీవల మృతిచెందారు. ఈమెకు ఇద్దరు ఆడపిల్లలు ఒక మగ సంతానం ఉన్నారు. శనివారం సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ సర్వేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతూ... పార్టీ నిర్వహించిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయటంలో ఎన్ని పనులు ఉన్నా తప్పనిసరిగా కార్యక్రమంలో పాల్గొనేవాడని ఆయన తెలిపారు. ధైర్యం కోల్పోవద్దని కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని చెప్పారు. సర్వేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఐ నాయకులు పంబి మోహనరావు, షేక్ కరీముల్లా, గడ్డాటి జోజిబాబు, సోమా బాబురావు తదితరులు ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులతో ఎంపీడీఓ సమీక్ష

విశాలాంధ్ర-గంపలగూడెం : ఆడదాంబి ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా గంపలగూడెం మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎర్రమల. పిచ్చిరెడ్డి శనివారం మండలంలోని వ్యాయామ ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. 21 గ్రామ సచివాలయాలలో అక్టోబర్ 2 నుండి క్రికెట్, బ్యాడ్మింటన్ ,వాలీబాల్, కబడ్డీ ,మరియు ఖోఖో మొత్తం 5 క్రీడా అంశాల లో ఆటల పోటీలు 17 సంవత్సరాల వయస్సు పైబడిన పురుషులకు, మరియు స్త్రీలకు ప్రత్యేకంగా పోటీలు జరుగుతాయి. పోటీలో పాల్గొనే క్రీడాకారులు గ్రామ సచివాలయాల్లో మరియు ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల వద్ద వారి టీం పేర్లను నమోదు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎర్రమల. పిచ్చిరెడ్డి తెలియజేశారు. గ్రామ సచివాలయ స్థాయిలో 8 రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గం స్థాయిలో 6 రోజులు, జిల్లా స్థాయిలో 7 రోజులు, రాష్ట్రస్థాయిలో 5 రోజులు మొత్తం 38 రోజులు వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.

ఎంపీపీ సొంత నిధులతో తూరలు ఏర్పాటు

విశాలాంధ్ర-ఎ.కొండూరు : మండలంలోని కుమ్మరికుంట్ల ఎలిమెంటరీ పాఠశాల సమీపంలో పాత రేపూడికు వెళ్లే రహదారి కిరువైపులావున్న సిమెంట్ బొంగలు పగిలిపోయి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో ఇళ్లలో మురుగునీరు వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందటంతో ప్రజలు, విద్యార్థులు అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఈ విషయాన్ని కుమ్మరకుంట్ల సర్పంచ్ లాహోరి కనకమహాలక్ష్మి ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎంపీపీ తన సొంత నిధులు రూ.50 వేలతో కొత్తగా సిమెంట్ తూరలు వేయించి సమస్యను పరిష్కరించారు. దీంతో ప్రజల, విద్యార్థుల సమస్య గట్టెక్కటం తో గ్రామస్తులు హర్షం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రేపూడి తండా సర్పంచ్ భూక్యా చంటి, కంభంపాడు మాజీ సర్పంచ్ దాసరి సతీష్,గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి గన్నే ప్రసాద్ యూత్ పరామర్శ

విశాలాంధ్ర-రెడ్డిగూడెం : రెడ్డి గూడెం దళితవాడకు చెందిన టీడీపీ నాయకులు చాట్ల అచ్చియ్య కుమారుడు చాట్ల మనోహర్ బాబు(22) ఇటీవల కాలంలో మృతి చెందారు. కాగా శనివారం నాడు గన్నే ప్రసాద్ యూత్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఉయ్యూరు బొల్లారెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఉయ్యూరు వెంకటేశ్వరరెడ్డి (పెద్దోడు) కలసి అచ్చియ్య కుటుంబాన్ని పరామర్శించి రూ. 10వేల ఆర్థిక సహాయం అందించారు. ఈకార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు మాతంగి రామారావు, అయ్యంకి కోటయ్యలు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేష్‌రెడ్డి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కనకదుర్గమ్మ దర్శనార్థం శనివారం దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో విచ్చేశారు. అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం కల్పించారు.పంచ హారతుల్లో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటాన్ని జస్టిస్ సురేష్‌రెడ్డికు అధికారులు అందజేశారు.

తిరుపతమ్మను సన్నిధిలో చీఫ్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ ఉదయరాణి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక తిరుపతమ్మ అమ్మవారిని శనివారం చీఫ్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ ఉదయరాణి దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి అమ్మవారి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మనసున్న, మనసెరిగిన హాజరత్తయ్య గుప్తా

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : మనసున్న, మనసెరిగిన, మహోన్నతుడు డాక్టర్ వేముల హజరత్తయ్య గుప్తా అని ప్రముఖులు పేర్కొన్నారు. మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ శనివారం గాంధీ నగరం చిట్టూరి హైస్కూల్ ప్రాంగణాన నిర్వహించిన 22వ వార్షికోత్సవ వేడుకలలో శ్రీధర్మ పురుష, సేవా తపస్వి,వ్యాఖ్యాన కళా శిరోమణి, నటులు, రచయిత, ఆధ్యాత్మిక, ధార్మిక, సాహిత్య, సాంస్కృతిక, సామాజిక రంగాల సేవకులు, అంతర్జాతీయ వాసవి క్లబ్స్ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ వేముల హాజరత్తయ్య గుప్తా కు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం జరిగింది. సభాధ్యక్షులుగా డాక్టర్ జి సమరం, ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు,సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కొనకళ్ల విద్యాధరరావులు మాట్లాడుతూ సమాజ సేవలో భాగస్వామ్యమై అందరి అభిమానానికి పాత్రుడైన సముచితమైన వ్యక్తికి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయటం అభినందనీయమన్నారు. ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతి మహోత్కృష్టమైనదని ఆ సంస్కృతి మృదుభాషి, స్నేహశీలి, మానవతావాది అయిన గుప్తాలో ప్రతిబింబిస్తాయన్నారు. అన్ని కోణాలలో పూర్తి అర్హత కలిగిన వ్యక్తికి జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయటం గొప్ప విషయమన్నారు.

ఆధునిక వైద్య సదుపాయాలతో సురక్ష క్యూఆర్

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : నగరంలోని ఓ హెూటల్ నందు డాక్టర్ సేవలు నిరంతరం అందించేందుకు సురక్షా క్యూఆర్ ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు డిప్యూటీ మేయర్, ఏడవ డివిజన్ వైసిపి కార్పొరేటర్ షేక్ సాజీల ముఖ్యఅతిథిగా విచ్చేసి సురక్ష క్యు ఆర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరికీ అందుబాటులో వైద్యం అందించాలని ఉద్దేశంతో ఈ సురక్ష క్యూ ఆర్ సంస్థ మంచి నిర్ణయంతో ఈ సురక్ష క్యూ ఆర్ ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని... మనం బాగుంటేనే మన కుటుంబీకులు ఆరోగ్యంగా , ఆనందంగా ఉంటారని అమే పేర్కొన్నారు. తక్షణమే వైద్య సహాయం అందించడానికి 6400 వైద్య నిపుణులు అందుబాటులో ఉన్నారని తెలిపారు.650 రుపాయలకే సంవత్సరం పాటు టెలీ కన్సల్టేషన్ పొందవచ్చన్నారు. అత్యధిక సదుపాయాలతో ల్యాబ్లు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగపరచుకోవాలని ఆమె కోరారు. తదనంతరం ఆంధ్రప్రదేశ్ ఫ్రాంచైజర్ వంశీ మాట్లాడుతూ డాక్టర్ సేవలు నిరంతరం అందించేందుకు సురక్షా క్యూఆర్ అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. 650 రుపాయలకే సంవత్సరం పాటు టెలీ కన్సల్టేషన్ పొందవచ్చన్నారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉంటారని వెల్లడించారు. ప్రిస్క్రిప్షన్ వాట్సాప్ ద్వారా పొందవచ్చని ఇంటి వద్దకే మెడిసిన్ ఆర్డర్ చేయవచ్చన్నారు. లక్ష రుపాయలు ఇన్సూరెన్స్ తో పాటు అత్యవసర సమయంలో 5 వేల రుపాయల అంబులెన్స్ ఖర్చు కూడా పొందవచ్చని తెలియజేసారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో తాకినేని పద్మావతి, కంచర్ల శ్రీకాంత్, విద్యాసాగర్ రెడ్డి, తుమ్మల చంద్రశేఖర్, వేమూరి వెంకట్రావు, సుబ్బారాయుడు, మణిదీప్, అవినాష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు

గుండెపోటుతో టీడీపీ కార్యకర్త మృతి

విశాలాంధ్ర-నందిగామ: తెలుగుదేశం పార్టీ కార్యకర్త గుండెనొప్పితో మృతి చెందారు. నందిగామలోని కొత్త హరిజనవాడకు చెందిన కోట. రంగయ్య(48) గుండె నొప్పితో శనివారం తెల్లవారు జామున మృతి చెందారు. తెల్లవారు జామున రెండు

గంటలకు గుండెనొప్పి రావడంతో 108 అంబులెన్స్ లో విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళగా చనిపోయిన్నట్లు డాక్టర్ తెపారు. మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మృత దేహాన్ని సందర్శించి నివాళు లు అర్పించారు. ఈయనకు భార్య మరియమ్మ,వీరికి ఇద్దరు పిల్లలు బాబ, పాప ఉన్నారు.

ఆరోపణలపై ఆంజనేయరెడ్డి వివరణ ఇవ్వాలి

-జనసేన నగర అధికార ప్రతినిధి గయాజుద్దీన్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తనపై వచ్చిన ఆరోపణ అవాస్తమని ఆంజనేయ రెడ్డి నిరూపించుకోవాలని, లేదంటే తన పదవికి రాజీనామా చేయాలని జనసేన నగర అధికార ప్రతినిధి, 40 వ డివిజన్ జనసేన అధ్యక్షులు షేక్ గయాజుద్దీన్ (ఐజా)డిమాండ్ చేశారు. శనివారం భవానిపురం లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంజనేయ రెడ్డి ఉదంతం పై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు. అలాగే పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఈ సంఘటనపై స్పందించి విచారణ చేయాలని అన్నారు. ఎమ్మెల్యే కూడా 40వ డివిజన్ ప్రజలకు చేసిందేమీ లేదని, పేదలకు పట్టాలు ఇస్తానని ఇంతవరకు ఇవ్వలేదని, ఎన్నో సమస్యలతో ప్రజలు అల్లాడుతున్నారని అన్నారు. వైసిపి నాయకులు, ఆంజనేయ రెడ్డి జనసేన నగర అధ్యక్షుడు పోతిన మహేష్ పై, జనసేన నాయకులపై ,వీర మహిళలపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని అన్నారు. అలాగే 40 వ డివిజన్ లో వైసీపీకి ఎంతో బలముందని చెప్పుకుంటున్న ఆంజనేయ రెడ్డి దమ్ముంటే తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేసి తనతో పోటీ చేయాలని సవాల్ విసిరారు. ఆంజనేయ రెడ్డి కార్పొరేటర్ గా ఏవిధంగా గెలిచాడో అందరికీ తెలుసని అన్నారు.

NRI INSTITUTE OF TECHNOLOGY
NRI COLLEGE OF PHARMACY
Approved by AICTE & Affiliated to JNTUK, KAKINADA
Best Industry connect Autonomous Institute with NAAC (A) & NBA
Agiripalli (M), Krishna (Dt.), A.P.,Ph : 0866 2469666, 9391878787, 9394686868
email : nrihitech@rediffmail.com & nripharmacycollege@gmail.com,

ADMISSION NOTIFICATION FOR 1ST B.TECH. 'B' CATEGORY (NON-NRI) AND UNFILLED NRI SEATS (NON MINORITY)

Applications are invited from eligible candidates for admission into I B.Tech. under'B' category (NON-NRI) and unfilled (NRI)seats for the academic year 2023-24in the following branches. No. of Category B seats (including unfilled NRI) in branch wise as follows.

Branch	Tuition fee per annum	No. of Seats	Branch	Tuition fee per annum	No.of Seats
CSE	Rs. 1,40,250/-	54	AIML	Rs. 1,40,250/-	36
CSE(AIML)	Rs. 1,40,250/-	54	ECE	Rs. 1,40,250/-	54
CSE (DS)	Rs. 1,40,250/-	54	EEE	Rs. 60,000/-	18
IT	Rs. 1,40,250/-	36	MEC	Rs. 60,000/-	18
CSER	Rs. 60,000/-	18	CIVIL	Rs. 60,000/-	18
B PHARMACY	Rs. 1,44,900/-	30			

Application forms can be downloaded from www.nriit.edu.in or obtained from the college office between 10.00 am and 3.00 pm on all working days from 26.08.2023 to 06.09.2023. Filled-in application form along with the required enclosures shall be submitted in the college office in person on or before 1.00 pm on 06.09.2023 along with registration fee Rs.1,000(JEE/ APEAPCET qualified candidates) Rs.1,200 for others in cash or by DD in favour of the college. The Tuition Fee and other fee shall be paid as specified. Provisional Merit List, before verification of the original certificates and personal interview will be displayed on college notice board and website on 11.09.2023. The selection and admission will be made as per the prescribed rules. The final merit list will be displayed on the college notice board and website on 12.09.2023.

Vijayawada
26.08.2023

R Venkata Rao, Chairman

ఇంటర్ ఫలితాల్లో ఉమ్మడి కృష్ణా టాప్

విశాలాంధ్ర-విజయవాడ : ఇంటర్మీడియేట్ ఫలితాల్లో అత్యధిక మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ఉమ్మడి కృష్ణాజిల్లా టాప్‌లో నిలిచింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో రెండింటిలోనూ మొదటి స్థానంలో ఉండటం విశేషం. ఫస్ట్ ఇయర్‌లో 57,321 మందిగాను 44,413 మంది ఉత్తీర్ణులైయ్యారు. 77శాతం మంది పాసైయ్యారు. సెకండ్ ఇయర్‌లో 45,944 మంది ప్రిపేర్ కాగా 38,350 మంది ఉత్తీర్ణత సాధించారు. 83శాతం మంది పాసైయ్యారు.

ఎస్సీల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఎస్సీ,ఎస్టీ,బిసీ,మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఏపి సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్ కుమార్ తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బడుగు వర్గాల పంక్షేమమే లక్ష్యంగా వారి ఉన్నతికి నవరత్నాలు ద్వారా పలు పథకాలు అమలు చేస్తున్నారని అలాగే చిన్నపిల్లల పౌష్టికకారం మొదలు కుని వృద్ధులు వరకు అనేక సంక్షేమ కార్యాక్రమాలు ఒక్క రూపాయి లంచాలకు,అవినీతికి తావు లేకుండా డిబిటి ద్వారా అందిస్తున్నామన్నారు. గతంలో ఎన్నడు లేని విధంగా 5 గురికి ఉపముఖ్యమంత్రులు పదవులు ఇచ్చి సామాజిక న్యాయం అనే పదానికి అర్థం చేప్పారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైస్సార్ లీగల్ సెల్ న్యాయవాది ఒగ్గు గవాస్కర్, బుదాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్టీఆర్ శతజయంతి

విశాలాంధ్ర-మచిలీపట్నం : శతజయంతిని పురస్కరించుకుని 2022 మే 28 వ తేదీ నుండి 2023 మే 28 వ తేదీ వరకు ఏడాది పాటు జరుపుతున్న ఉత్సవాలలో భాగంగా ఈ నెల 28 వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు విజయవాడలోని అనుమోలు గార్డెన్స్ (తాడిగడప 100 అడుగుల రోడ్డు) లో ఎన్.టి.ఆర్. శతజయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు అఖిలభారత ఎన్.టి.ఆర్. అభిమానసంఘం, కృష్ణాజిల్లా అధ్యక్షులు మన్నె సోమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఎన్.టి.ఆర్. సెంటినరీ సెలెబ్రేషన్స్ (ఎన్టీఆర్ సెంచరీ సెలబ్రేషన్స్) ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో ఎన్.టి.రామారావు చారిత్రక ప్రసంగాలు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గా ఎన్టీఆర్ అసెంబ్లీలో చేసిన ప్రసంగాల పుస్తకాలను ఆవిష్కరించనున్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, సౌత్ ఇండియన్ సూపర్ స్టార్ రజనీకాంత్, మరియు నటసింహం నందమూరి బాలకృష్ణ,ఎం.ఎల్.ఏ., ఎస్.వెంకట నారాయణ, సీనియర్ జర్నలిస్ట్ ముఖ్యఅథితులు గా పాల్గొంటారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో గల ఎన్టీఆర్ గారి అభిమానులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసినదిగా అఖిలభారత ఎన్.టి.ఆర్. అభిమానసంఘం తరుపున కోరుచున్నాము.

ప్రముఖ నాట్యాచారిణి మంజు భార్గవికి సన్మానం..

ఒకే వేదికపై ముగ్గురు 'కళారత్న'లు

విశాలాంధ్ర-కూచిపూడి : శ్రీ అఖిలభారత కూచిపూడి నాట్య కళామండలి అధ్యక్షురాలు, కూచిపూడి నాట్య కళాకారిణి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా రత్న మంజు భార్గవిని ఆ కళామండలి కార్యదర్శి పసుమర్తి మృత్యుంజయ శర్మ పర్యవేక్షణలో మంగళవారం రాత్రి ఘనంగాసత్కరించారు. గత మూడున్నర దశాబ్దాలకు పైగా అప్పటి కార్యదర్శి పసుమర్తి కేశవ్ ప్రసాద్. హయాంలోకళామండలి అధ్యక్షురాలుగా కొనసాగుతున్న ఆమె ప్రస్తుతం ఆయన కుమారుడు నాట్యాచార్యపసుమర్తి బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీత పసుమర్తి మృత్యుంజయ శర్మ సారథ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ అఖిలభారత కూచిపూడి నాట్య కళా మండలి"కి కూడా ఆమెనే అధ్యక్షురాలుగా ఎన్నుకొన్నారు. ఈ నూతన కళా మండలి ఏర్పడిన తర్వాత తొలిసారిగా కూచిపూడి విచ్చేసిన ఆమెను శాలువాతో, సన్మాన పత్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సిద్ధ యోగి కూచిపూడి నాట్య కళా పీఠం ప్రధాన ఆచార్యులు కేంద్ర సంగీత నాటక అకాడమీసభ్యుడు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా రత్న డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, విశ్రాంత నాట్య అధ్యాపకులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం, నాట్య కళా మండలి సభ్యుడు కాపూరి పూర్ణచంద్ర శర్మ, కళా పీఠం ఉప ప్రధానాచార్యులు డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా అతిథులను కళామండలి సత్కరించుకొంది.

భారతీయ స్టేట్ బ్యాంక్ ఆధ్వర్యంలో రేపే "ఔట్ రీచ్ ప్రోగ్రాం"..

విశాలాంధ్ర-కూచిపూడి : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కూచిపూడి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం" అవుట్ రీచ్ ప్రోగ్రాం'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ శాఖ మేనేజర్ జి. సుమతి బుధవారం విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మొవ్వ రోడ్ లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంగణం వద్దగల ఎస్ ఎస్ ఎస్ . కళ్యాణమండపం వేదికపై నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలకు, వ్యాపారస్తులకు?40 కోట్ల చెక్కు పంపిణీ నిర్వహిస్తారని వెల్లడించారు. బందరు పార్లమెంట్ సభ్యులు వల్లభనేనిబాలశౌరి, పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్, జిఎం. ఓం నారాయణ శర్మ, డీజీఎంలు వి హేమ, కె.రంగరాజన్, వి రామయ్య, ఆర్ ఎం. ఫణి రామ్.కుమార్ ఈ కార్యక్రమంలో అతిథులుగా పాల్గొంటారని వెల్లడి చేశారు. ఈ కార్యక్రమానికి ఖాతాదారులు, గ్రామస్తులు, వ్యాపార వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాలలోని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు.

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని పెదపూడి ఎంపీ యూపీ ప్రైమరీపాఠశాలలో బుధవారం విద్యార్థిని విద్యార్థులకు హిమో గ్లోబిన్ పరీక్షలను నిర్వహించారు. ఆ పాఠశాలలోని తొమ్మిది నుంచి 14 సంవత్సరాల లోపు గల బాలికలు46 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందు బిళ్ళలను పంపిణీ చేశారు. పెదపూడి సచివాలయ ఏఎన్ఎం ఏ రత్నకుమారి సారథ్యంలో నిర్వహించిన ఈ పరీక్షలకు ఆశా వర్కర్స్ సహకరించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. ఉషారాణి, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు పర్యవేక్షించారు.

మొవ్వ తహసిల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయుల ధర్నా.

విశాలాంధ్ర-కూచిపూడి : "ఉపాధ్యాయులపై అధికార దాడులు నిలిపివేయాలి... సస్పెన్షన్ రద్దు చేయాలి"అంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో మొవ్వ తాసిల్దార్ కార్యాలయంలో పూర్వపు తాలూకా పరిధిలోని మొవ్వ, ఘంటసాల, చల్లపల్లి మండలాల్లోని ఉపాధ్యాయులు బుధవారం నిరసన ధర్నా చేసి వినతిపత్రాన్ని తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్.కు అందజేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలలో తనిఖీ సందర్భంగా చిన్న చిన్న కారణాలతో అధికారులను ఉపాధ్యాయులను అక్రమంగా సస్పెన్షన్ గురి చేస్తూ దోషులుగా చిత్రీకరించడం పై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఇవి రామారావు, ఏపీ డీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే ఎస్ సోమేశ్వరమ్మ, ఫ్యాప్టో నాయకులు ఆర్ బాలాజీ, కే మాధవరావు, శివ, ఇంతియాజ్, చింతయ్య, కవిత, కే నిర్మల తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హోల్ సేల్‌గా లూటీ చేసేందుకు కుట్ర

విశాలాంధ్ర-మచిలీపట్నం : మచిలీపట్నం లూటీ చేసేందుకే ముడా నూతన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు వైసీపీ నాయకులపై ధ్వజమెత్తారు. బుధవారం కొల్లు రవీంద్ర నివాసంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ నాడు భవిష్యత్తు తరాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మచిలీపట్నం అర్బన్ డెవలెప్‌మెంట్ అథారిటీ (ముడా)ని ఏర్పాటు చేశామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముడా సంస్థను నిర్వీర్యం చేసి తాజాగా తయారు చేసిన మాస్టర్ ప్లాన్‌పై ఎన్నో తప్పులు దొర్లాయని వారు అన్నారు.

మల్టీ పర్పస్ జోన్లు లేకుండా 90% రెసిడెన్షియల్ జోన్‌గా మార్చారు. దీనివల్ల భవిష్యత్తు తరాలకు తీరని నష్టం ఏర్పడుతుందని, మాస్టర్ ప్లాన్ తయారీ అంతా లోపభూయిష్టంగా ఉంచి ప్రైవేట్ ఆస్తులను దోచుకునేలా మాస్టర్ ప్లాన్ని తయారు చేశారని వారు తెలిపారు. గుడి, బడిని కూడా దోచుకునేలా మాస్టర్ ప్లాన్ ఉందని, వైసీపీ నేతల సొంత ఆస్తులను కమర్షియల్ జోన్ లో పెట్టుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, పిప్పళ్ల కాంతారావు,రాళ్ల కొట్టు రాము,దేవరపల్లి అనిత, వాలిశెట్టి తిరుమలరావు, కోస్తా మురళి, లెంకేసెట్టి నీరజ,కరెడ్ల సుశీల,గోకుల్ శివ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విభజన చట్టం రాజ్యాంగబద్ధంగా రాజకీయ పరిపక్వతతో జరగాలి కానీ అధికార ప్రతిపక్షాల మధ్య దోబూచులాడి కేంద్రం రాష్ట్రాన్ని,ప్రజలను వంచనకు గురి చేసిందని దానికి ఏపీ పాలకులు భజన చేయడమే కారణమని హెూదా సాధన జేఏసీ రాష్ట్ర చైర్మన్ చింతా రాజశేఖర్ అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో హెూదా సాధన కోసం జేఏసీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదు అనేదే ప్రశ్న ప్రజలకు సమాధనం చేప్పాలని డిమాండ్ చేశారు.ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దేవరపల్లి మహేష్,రిపబ్లికన్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మేక వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ పాలకుల అసంబద్ధ వ్యవహారమే రాష్ట్రానికి హానికరంగా మారిందని ఆంధ్ర తెలంగాణ కలిసి ఉండాలన్న నిబంధన పంపకాలపై తెలంగాణ తో సాధించుకోవాల్సిన ఉన్నాయని కానీ చెప్పా పెట్టకుండా హైదరాబాదు లాంటి ఉమ్మడి రాజధాని వదులుకోవాల్సిన స్థితి ఏర్పడిందన్నారు. బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారాబత్తుల శ్రీనివాసరావు మాట్లాడుతూ త్వరలో హైదరాబాదులో విభజన హామీలపై రెండు రాష్ట్రాల ప్రజాస్వామ్యవాదులు మేధావులు తో చర్చ సమావేశం నిర్వహిస్తామన్నారు. కెసిఆర్ మొదటినుండి ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హెూదా మద్దతుని పలుకుతూనే ఉన్నారని రాజకీయ ప్రయోజనాల కోసం కొంతమంది దళారులు అడ్డుకుంటామని అనడం అర్థరహితం అన్నారు. హెూదా సాధన జేఏసీ అన్ని రాష్ట్రాల అధికార ప్రతిపక్ష పార్టీలను కలుపుకొని ఏపీకి జరిగిన అన్యాయం మరో రాష్ట్రానికి జరగకుండా ఉండేందుకు ఐక్య కార్యాచరణలో భాగస్వామ్యం చేస్తామన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఐపీసీ అధికార ప్రతినిధి జేఏసీ అధికార చైర్మన్ గోరింత అప్పలరాజు మాట్లాడుతూ ఐదు కోట్ల ఆంధ్ర ప్రజల పక్షంగా జై ఆంధ్ర అమరవీరుల ఆశయాల సాధన కోసం పోరుకు ఎంత త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నామన్నారు.అందులో భాగంగా 26 జిల్లాల కలెక్టర్లకు ఎంపీలకు వినతి పత్రాలను అందిస్తామన్నారు. పార్లమెంటు సభ్యులు ఈ సమస్యపై గళం విప్పాలని లేనిపక్షంలో ఆంధ్రా ప్రజాపక్షంగా రాజీనామాలకు సిద్ధపడాలన్నారు. ఈ పద్మవ్యూహాన్ని చేదించడానికి అన్ని జిల్లాల మేధావులు సిద్ధంగా ఉండాలని ప్రతి ఒక్కరి మద్దతు భాగస్వామ్యం జేఏసీకి ఇవ్వాలని ఈ కార్యక్రమంలో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐపిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోగిరెడ్డి అంజని రెడ్డి. ఐపీసీ ఉపాధ్యక్షురాలు గోవిందరాజులు కవిత. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బెజవాడ పుల్లారావు. రాష్ట్ర నాయకులు సొంగా మధు.జైబాబు, బిసి నాయకులు చేవూరి ఓంకార్. ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గద్దల ఆదాం. ఐ పి టి యు సి జూనపూడి వెంకటేశ్వరరావు. ఐపిసి నాయకులు కే ఏ గాంధీ. ఎం కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎగుమతి ఆర్డర్లను పొందిన ఐఎఫ్ఎల్

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : ఫ్రెరీనా హెూల్డింగ్ లిమిటెడ్ నుంచి ఎగుమతి ఆర్డర్లు పొందినట్లుఐఎఫ్ఎల్ ఎంటర్ ప్రైజెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఎఫ్ఎ డోలార్ షా ఒక ప్రకటనలో తెలిపారు. కెన్యాలోని పాఠశాలలకు రాత పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, బాండ్ పేపర్లు, కాపీ పేపర్లను సరఫరా చేసేందుకు ఈ ఆర్డర్ వచ్చింది. ఆర్డర్ మొత్తం ఎఫ్బ విలువ 8.16 మిలియన్ డాలర్లు (సుమారు రూ.67 కోట్లు ఉంటుందని అంచనా. ఒక సంవత్సరంలోపు ఈ మొత్తం సరఫరా చేయాల్సి ఉంటుందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అందించాల్సిన 8.16 మిలియన్ డాలర్ల విలువైన ప్రతిష్టాత్మక ఆర్డర్ను మా కంపెనీ గెలుచుకోవడం సంతోషంగా ఉందన్నారు.

యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : అంతర్జాతీయ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రంలో ఉచిత ఆరోగ్య శిబిరాలను నిర్వహించనున్నట్లు యాక్సిస్ బ్యాంక్ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆరోగ్య శిబిరాలను విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, విశాఖపట్నంలలో ఎంపిక చేసిన యాక్సిస్ బ్యాంక్ కేంద్రాల వద్ద నిర్వహించనున్నామన్నారు. ఈ ఆరోగ్య శిబిరాలలో ఉచితంగా వైద్య పరీక్షలు చేయడంతో పాటుగా డాక్టర్ల కన్సల్టేషన్ కూడా ఉచితంగా అందిస్తారన్నారు. ఈ పరీక్షలలో కంటి పరీక్షలు, బీపీ, ఆర్‌బీఎస్, ఈసీజీ వంటివి ఉంటాయని వివరించారు.

మహీంద్రా'నుంచి సరికొత్త విప్లవం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : భారతదేశంలో నెం.1 పికప్ బ్రాండ్ అయిన బొలె మహీంద్రా నుంచి సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ శ్రేణిని విడుదల చేసినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తిగా సరికొత్త బొలెరో ఎంఎక్స్ఎక్స్ శ్రేణి పేలోడ్ సామర్థ్యం, ఇంధన సామర్థ్యం, భద్రత మొత్తం డ్రైవింగ్ అనుభవాలకు సంబంధించి కొత్త మైలురాళ్లను సృష్టిస్తుందన్నారు.

టాటా నుంచి సంపూర్ణ రక్షా సుప్రీం

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట : టాటా ఎఐఎ వైటాలిటీ అనేది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన, సైన్స్-ఆధారిత వెల్‌నెస్ ప్రోగ్రామ్ వినియోగదారులకు అందుబాటులో తీసుకొస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఇది వినియోగదారులకు వారి ఆరోగ్యాన్ని అర్థం చేసుకోవడంలో, మెరుగుపరచడంలో సహాయపడుతుందన్నారు. సంవత్సరాల్లో ప్రీమియం తగ్గింపు వారి ఆరోగ్య స్థితి ఆరోగ్య అంచనాలను పూర్తి చేయడం, ఫిట్‌నెస్ లక్ష్యాలను సాధించడం మొదలైన వాటి ఆధారంగా పెరగవచ్చు లేదా తగ్గవచ్చనీ వివరించారు.

సోషల్ సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సింగ్ నగర్ లో ఉన్న మాతృ దేవో భవ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.నగరానికి చెందిన వై,సుధాకర్ బాబు సతీమణి దివంగత వై,ధనలక్ష్మి 5 వ వర్ధంతి సందర్భంగా అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.ఈ అన్నదాన కార్యక్రమం లో సహకరించిన అందరికీ సొసైటీ కార్యదర్శి కొండాయ గుంట రాము ధన్యవాదములు తెలిపారు.కార్యక్రమం లో డాక్టర్ బ్రహ్మ దేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బ్రహ్మ దేశం వసంత కుమార్ కార్యదర్శి కొండా య గుంట రాము,కోశాధికారి గుర్రం ఏడు కొండలు,ఉపాధ్యక్షులు మండా రాము,ఫణి,చుక్క పల్లి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆధ్వర్యంలో సహస్ర చండీయాగం ప్రారంభం

విశాలాంధ్ర విజయవాడ (లబ్బీపేట) : లోక కళ్యాణార్థం శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం ఆధ్వర్యంలో ఈనెల 27వ తేదీ నుండి మే మూడో తేదీ వరకు సహస్ర చండీయాగం,కుంభా భిషేకం కార్యక్రమాలు వైభవోపేతంగా ప్రారంభం అవుతున్నాయని ఉత్సవ కమిటీ చైర్మన్ పి. గౌతమ్ రెడ్డి చెప్పారు. బుధవారం సహస్ర చండీయాగం జరిగే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడారు. ఉత్సవ కమిటీ చైర్మన్ పి.గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం జరుగుతున్న సహస్ర చండీయాగం లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని చెప్పారు. 72 అడుగుల ఎత్తైన అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. సహస్ర చండీయాగం ప్రారంభ కార్యక్రమంలో తొలి రోజున రాష్ట్ర మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు,జోగి రమేష్, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొంటారని చెప్పారు. అలాగే ఇంకా ఎంతో మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన చెప్పారు. సేవ్ టెంపుల్స్ భారత్ సంస్థ నిర్వాహకులు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తి శక్తి పీఠం ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి మేమూడో తేదీ వరకు నిర్వహించనున్న సహస్ర చండీయాగం, కుంభాభిషేకం కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొవాలని విజ్ఞప్తి చేశారు. గంగా పుష్కరాల సమయంలో ఈ కార్యక్రమం జరగడం ఎంతో శుభకరమని అన్నారు. ఈ చండీయాగంలో పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. ఎన్నో భక్తి కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కరుమారి దాసు మాట్లాడుతూ కోరిన కోరికలను తీర్చే కల్పవల్లి, ఆదిపరాశక్తి కృపాకటాక్షాలు ప్రజలపై ఉండాలని సహస్ర చండీయాగం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ధన్యులు కావాలని భక్తులను కోరారు. కమిటీ సభ్యురాలు,నగర వైసీపీ మాజీ మహిళా కన్వీనర్ లఖంరాజు సునీత మాట్లాడుతూ ఈ సహస్ర చండీయాగం సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మహా కార్యక్రమంలో మహిళా భక్తులు వేలాదిగా పాల్గొంటున్నట్లు చెప్పారు.ఈ సమావేశంలో శ్రీశ్రీశ్రీ కల్యాణ స్వామి ఈ సహస్ర చండీ యాగం విశిష్టతను వివరించారు.

సామాజిక తనిఖీపై శిక్షణా కార్యక్రమం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: త్వరలో ప్రభుత్వం నిర్వహించనున్న పాఠశాలల నాడు-నేడు కార్యక్రమంపై విద్యాశాఖ బుధవారం విస్సన్నపేటలో శిక్షణా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మీవో సి.హెచ్.రామకృష్ణ నాడు-నేడు పనుల్లో భాగంగా పాఠశాలల్లో జరిగిన అభివృద్ధి, ఇందుకు అయిన వ్యయంపై సమీక్షించారు. ప్రభుత్వం ఇచ్చిన నిధులకు సంబంధించిన నిధుల ఖర్చుపై పూర్తి వివరాలతో త్వరలో జరిగే సామాజిక తనిఖీకి హెచ్ఎంలు హాజరు కావాలని ఆయన సూచించారు.

సోవమ్మను చంపిన హంతకుడు అరెస్టు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రమైన వీరులపాడు లో సోవమ్మ అనే ఒంటరి మహిళ ఈనెల 15వ తేదీన ఆమె నివాసం లో దారుణ హత్యకు గురైంది. హత్య జరిగిన ఉదంతాన్ని వీరులపాడు పోలీస్ స్టేషన్ నందు సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో రూరల్ సిఐ నాగేంద్ర కుమార్, ఎస్సై సోమేశ్వరరావు లు విలేకరులకు తెలిపారు.సోవమ్మ కు వివాహం కాగా భర్తతో విడిపోయి ఒంటరిగా జీవిస్తుంది కేసులో అనుమానితులను విచారించిన పోలీసులు హత్య చేసిన నిందితుడు మృతురాలి ఇంటి పక్కనే ఉండే పొట్టిపోగు ఏసోబు గా గుర్తించినట్లు, నిందితుడు ఘటన జరిగిన రోజు నుంచి కనిపించకుండా పోవడంతో అతని కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు నిందితుడు విజయవాడ ఆర్టీసీ బస్ స్టాండ్ వద్ద తిరుగుతుండగా ఈ నెల 25 న అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. పోలీసుల విచారణలో మృతురాలి కారణంగా తన కుటుంబం లో గొడవలు జరుగుతున్నాయని, ఆమెను చంపాలని నిర్ణయించుకొని రోకలి బండ తో తలపై గట్టిగ కొట్టినట్లు నిందితుడు తెలిపినట్లు పోలీసులు వివరించారు. నిందితుడి ఇంట్లో హత్యకు ఉపయోగించిన రోకలిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో మృతి చెందిన చింతల్

విశాలాంధ- కంచికచర్ల: ఆగి ఉన్న డీసీఎం వ్యానును వెనుక నుండి ఐరన్ లోడుతో వెళ్తున్న ట్రాలీ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం తెల్లవారుజామున మండలంలోని కీసర టోల్ ప్లాజా సమీపంలో జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. సేక రించిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ నుండి ఏపీ 07 టిఎన్ 33 48 నెంబర్ గల డీసీఎం వ్యాన్ హనుమాన్ జంక్షన్ ప్రక్కన నందివాడకు పెళ్లి బృందంతో వెళు తున్న క్రమంలో కీసర సమీపంలో రహదారి ప్రక్కన నిలుపుదల చేశారు. కాలకృత్యాల నిమిత్తం వ్యాను నుండి కొందరు క్రిందకి దిగిన సమయంలో వెనుక నుండి విజయవాడ వైపు ఐరన్ లోడ్ తో వెళ్తున్న ఏపీ 16 టీజీ 5826 నెంబర్ గల ట్రాలీ, పెళ్లి బృందం వెళుతున్న డీసీఎం వ్యాన్ ను వెనుక నుండి బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటన లో మిర్యాలగూడ కి చెందిన జల్లూరి చింతల్ (45) అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెంద గా, మరొక ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. గాయపడిన వారిని 108 అంబులెన్స్లో నందిగామ ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. సంఘటన స్థలాన్ని చేరుకున్న పోలీ సులు ప్రమాదానికి కారణమైన ట్రాలీ డ్రైవర్ ను అదుపులోకి తీసుకు న్నారు. మృతి చెందిన చింతల్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ మార్చురీకి తరలించారు. ట్రాలీ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం కారణంగా ప్రమాదం జరిగి ఉంటుంద ని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరాలి.

విశాలాంధ్ర- కంచికచర్ల: కంచికచర్ల గ్రామం నందు స్థానిక అరుంధతి నగర్ లో అరుంధతి విద్యార్థి సేవా సమితి ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ ప్రవాస భారతీ యులు,లండన్ కు చెందిన శ్రీ బొబ్బిలి ప్రభాకర్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. విశ్రాంత ఉపాధ్యాయులు మరియు విద్యార్థి సేవా సమితి సభ్యులు శ్రీ ముండ్లపాటి పోతరాజు గారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్ర మంలో బొబ్బిలి ప్రభాకర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అరుంధతి విద్యార్థి సేవా సమితి ద్వారా నిర్వహించే వివిధ రకాల కార్యక్రమాలను విధి విధానాలను అభినందించారు. ప్రతి విద్యార్థి కష్ట పడి చదువుకొని ఉన్నత స్థాయికి వెళ్లాలని , అలా కష్టపడి చదువుకునే వారికి తన వంతుగా సహాయం చేస్తా నని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇద్దరు విద్యార్థులను లండన్ లో చదువుకునే విధంగా కృషి చేశానని డిగ్రీ , బీటెక్, పీజీ చేసిన విద్యార్థులకు మంచి అవ కాశాలు కలవని వాటిని అరుంధతి విద్యార్థి సేవా సమితి ద్వారా ప్రతిపేద విద్యార్థులు వినియోగించుకోవాలని తెలియజేశారు. అరుంధతి విద్యార్థి సేవ సమితి సభ్యులు ఎం. జార్జి, సిహెచ్. విక్టర్ నగేష్,ఐ . నాగేశ్వరరావు,కె .రమేష్,వి .ప్రభాకరరావు, ఎస్. వాసు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,పెద్దలు,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు .

క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లిన తాతయ్య

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : నందిగామ బైపాస్ రోడ్ లో జరిగిన బైక్ ప్రమాదంలో క్షతగాత్రులను తన కారులో హాస్పటల్ కు తీసుకెళ్లిన ఘటన బుధవారం సాయంత్రం జరిగింది పోలీసులు అందించిన సమాచారం ప్రకారం వత్సవాయి మండలం పోలంపల్లి గ్రామానికి చెందిన జిడుగు సాంబయ్య కుమార్తె రామలక్ష్మి,కుమారుడు జగదీష్ లు వారి అమ్మమ్మ ఊరైన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలం,జి. కొండూరు గ్రామం నుండి బుధవారం సాయంత్రం వారి మేనమామ అయిన భట్టిప్రోలు ఆంజనేయులు బైక్ పై పోలంపల్లి వెళ్తుండగా మార్గమధ్యం లో నందిగామ హైవే వద్ద వెనుక నుండి మరొక బైక్ వేగంగా వచ్చి వీరి బైక్ ను ఢీకొనగా ఘటనా స్థలంలో గాయాలతో పడి ఉన్నారు అదే సమయంలో విజయవాడ నుండి జగ్గయ్యపేట వస్తున్న టిడిపి జాతీయ కోశాధికారి, జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తమ వాహనంలో ఎక్కించుకొని జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వచ్చారు ముందుగానే వైద్యులకు సమాచారం అందించి దగ్గరుండి చికిత్స చేయించారు ఈ సంఘటన జరిగిన సమయంలో అక్కడ ఉన్న ప్రజలు మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ తాతయ్యకు అభినందనలు తెలియజేశారు...

జగనన్న వసతి దీవెనతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : జగనన్న వసతి దీవెన పథకంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఇందుకు జిల్లాలో 37,806 మంది విద్యార్థులకు రూ.36.18కోట్లు తల్లుల ఖాతాల్లో జమచేసినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, ప్రజా ప్రతినిదులు బుధవారం నిర్వహించిన వసతి దీవెన చెక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించాలన్న కలను నెరవేర్చాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ ఉన్నత విద్యకు అర్హులయిన విద్యార్థులకు క్రమం తప్పకుండా కళాశాల ఫీజులు చెస్తున్నట్లు తెలిపారు. వసతి దీవెన పథకం ద్వారా ఏడాదికి రూ.20వేలు ఆర్థిక సహాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తోన్న సహాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాదించాలతని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎం.విష్ణువర్ధన్, నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి, నగర డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి, వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లు, జిల్లా సాంఘీక సంక్షేమాధికారి రుక్మాంగదయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.